# ఇల్లు ఇరకటం - ఆలి మరకతం

♦♦♦

♦ రచన: మాస్టర్ రవి ♦

'హమ్మయ్య...ఫీడా విరగడైంది. వాళ్లని ట్రైనెక్కించేసి, వచ్చేస్తున్నప్పుడు, వేంకటేశ్వర స్వామి వారి కోవెల్లో, ఓ కొబ్బరి కాయకూడా కొట్టేసివచ్చాను. ఆఁ...అన్నట్టు మరిచిపోయాను. శ్రీనివాసలో మళ్ళీ 'మల్లీశ్వరి వచ్చింది? విని, రెండు టిక్కెట్టుకొనమని, పక్కింటి గోపీకి డబ్బులిచ్చి, క్యూలో నిలబెట్టి మరీ వచ్చాను. డియర్ తో...కొంత సేపు సరదాగా గడిపి, నాలుక్కల్లా లేచి, వేడివేడిగా బజ్జీలు, కాఫీ సేవించి, డ్రెసప్ అయి, అయిదుకల్లా, హాయిగా చిలకాగోరింకల్లా, నడుచుకుంటూ సిన్మాకెళ్దాం. వెధవఖర్మ...గట్టిగా ఊపిరిపీల్చుకుందుక్కూడా అవకాశం కుదర్లేదు కదా వారం రోజులై...'అన్నాడు సుధాకరం, మంచంమీద ట్రిమ్‌గా తయారై, పడుకుని, అవసరాల వారి 'సహజీవన సౌభాగ్యం' చదువుతూన్న కమల సరసన చేరుతూ.

ఊఁ_అని మూతిముడిచి, కళ్ళు టపటపలాడించి, అటు తిరిగి, చదువు సాగించింది కమల.

'ఇహ దేవిగారు అలకసాగించారు గాబోలు. ఛస్తున్నాం బాబూ ఈ చిలకల అలకలుతీర్చేటప్పటికి. ఎవ్వరూ లేరు_ఒంటరిగా సమయం చిక్కింది., ఏదో సరదాగా. అనుకుంటే, ఇహ నువ్వుపట్టిస్తున్నావా...సరే......ఏం జేస్తాం? అలాట లిఖితం' అన్నాడు సుధాకరం ఇటు తిరిగి పడుకుంటూ.

* * * *

సుధాకరం కలెక్టరాఫీసులో యూడీసీ. అతను, ఎవరో దొరరాసిన 'లైఫ్ మేడీజీ' చదివి, అలాగే నడుచుకుందామని విశ్వప్రయత్నం చేస్తూంటాడు. అందరూ_నువ్వు చాలా అదృష్టవంతుడివోయ్, ఇలా పెళ్ళయిందో లేదో, అలా హాయిగా అందాలవాడ_విజయవాడకి బదిలీ అయిపోయింది, ఇహ హామేషా మీదే కులాసా, విష్‌యూ గుడ్‌లక్_' అని చేతులూపారు. నిజంగాబోలనుకుని సుధాకరం తలూపాడు.

తీరావిజయవాడవచ్చి, హోటల్లో దిగి, ఇల్లుకోసం వెతకడం ప్రారంభించేసరికి, ఎండల్లో టాపు లేచిపోయేసరికి, ఇది విజయవాడకాదు బాబోయ్ _ విలయవాడలగాని_అనుకున్నాడు. హోటల్లో తినడం, సాయంత్రాలు వీధులెమ్మట, తప్పిపోయిన కుర్రాళ్ళా, ఇల్లిల్లూ చూసుకుంటూ తిరగటం.

ఇలా నెళ్ళాల్లు తిరిగేప్పటికి, గాంధీనగరంలో ఒ సినాహాలు పక్కనున్న ఓ డాక్టర్ గారింట్లో ఓ చిన్న పోర్షన్ కుదిరింది.

'ఇల్లెంత వుంది? నీరు కరెంటు, మంచిగాలి_ఇత్యాదివి అన్నీ వున్నాయా_అని అడగవల్సిన అవసరం ఎవరికీ లేదు. ఎంచేతంటే, వీటి వివరాలు సవివరంగా అందరికీ తెలుసు. తెలియందొక్కటే. అద్దె. దానికి ప్రగతి పథం మీద విశ్వాసం జాస్తి. నిశ్చలత్వం మీద నమ్మకం నాస్తి, అంతేక, అది ఎంత రద్దీలోనైనా, చొరవచేసుకుని, దోవచూసుకుని, పరుగెడుతూంటుంది. ఆ కారణంగా 'అద్దెంతేవిటి?' అని మాత్రం అడిగారు మిత్రులు. నా జీవితంలో నాలుగోవంతు అని, తలుచుకోవడానికే భయంకరమైన ఆ విషయాన్ని మరిచి పోవడానికి విఫలప్రయత్నం చేశాడు సుధాకర్.

ఆరువాటాలు వరసాగా వున్నాయి. ఇళ్ళకి ఒకటే తోవ. అభిమన్యుల్లా లోనికి వెళ్ళిన తోవనే రావాలి. పెరడు అంటే వాళ్ళకి తెలీదు. వంటగది తర్వాత చక్కగా సున్నంవేసిన గోడ. నిజమైన అమెరికన్ గాని వస్తే వున్న ఆ ఒక్క గదిలో, కాళ్లు చాచుకుని పడుకోలేదు. ఎత్తైన ఇండియన్ తలెత్తి నడవలేడు. కొళాయికీ, లైట్లకీ నిర్ణీత సమయాలున్నాయి. ఆ గది వెనకాల, ఒక చిరిగిన పేలికలా వున్న చిన్న వరండా. అందులో మీరు వండేసుకుంటారో, అవసరంవస్తే పండేసుకుంటారో అది మీ యిష్టం.

నూతన వధూవరులకు, అలాంటివాటాలు హాయిగా వుంటాయి గానీ, ఎవరేనా బంధుజనం వస్తేనే అసలైన చిక్కు ఎదురయ్యేది. అందరూ ఆ గదిలో పడుకోలేరు, బైట వరండాలో_పడుకోడం సభ్యత కాదు. అతిథుల్ని గదిలో పడుకోమని, తాము వరండాలో పడుకోడం ఘోరమైన త్యాగం.

ఏం చేసుకున్నా, ఎన్ని చేసుకున్నా ఆ ఒక్కగదే శరణ్యం. వాటాల ఇల్లుగాబట్టి, అంతా కలిసి బైట చేస్తారు అరణ్యం. అందుకే ఇంటి ఓనర్ చూపించడు అసలు కారుణ్యం.

ఇవన్నీ ఎలాగేనా భరించవచ్చుగానీ, ఇంటిగలవాళ్లు కూడాఅతిదగ్గర్లో ఉండడంమాత్రం భరించలేనివాళ్ళ

మనచేతిలోంచి గరిటె జారిపోయినా, అన్నం గిన్నె జారి కాలిమీద పడినా, వాళ్ళ గోడల్నిండా కన్నాలు పెట్టేసున్నామేమో అనే అనుమానంగాక, పూర్తి విశ్వాసంతో, వాళ్ళ సి ఐ డి. చిన్నమ్మాయిని పంపిస్తారు ఇంటికి.

రాత్రి నిర్ణీతసమయం అయిపోగానే –' సుధాకరం గారూ టైమెంతైందండీ–నా వాచీ ఆగిపోయిందిగానీ.' అంటూ అతి మృదువుగా లైట్లార్పండని తెలియ జేస్తారు

ఇల్లు దొరకడమే,లాటరీలో లక్షలొచ్చినంత గొప్పగా భావించే పరిస్థితిలో, ఇవన్నీ ఎవరాలోచిస్తారు?

'సుధాకరం ఎలాగైతేనేం ఇల్లు ఏర్పరచి, వాళ్ళ వూరెళ్ళి కమలని తీసుకువద్దామనుకున్నాడు. అక్కడికి వెళ్ళి వున్న ఆ నాలుగురోజులూ, వాళ్ళిద్దరూ ఏం సుఖపడ్డారో గాని, వెళ్ళేముందు తమతో బయలుదేరిన కమల విధవ మేనత్తతో, ఓ నెల్లాళ్ళు. అద్దం బీరువాలో అడ్డయినాయి వాళ్ల బతుకులు.

గట్టిగా వూపిరితీస్తే వినిపించిపోతుందన్న ఇంట్లో– ఇహ... వాళ్ళ మొహం... వాళ్లేం కాపరం వెలగబెట్టగలరు? వచ్చిన ఆ మేనత్తకేనా, ఆ మాత్రం జ్ఞానం వుండక్కర్లా?

అందమైన కమల, మిసమిసలాడుతూ ఇంట్లో తిరుగుతూంటే, పడుకున్నప్పుడు అరజారిన పయ్యెద కంటబడుతూంటే–ఇదేం ఖర్మరా భగవంతుడా 'ఈ ముసల్దెవిటి మామధ్య?, వచ్చే జన్మలో పిల్లి చెవులో జలగై పుడుతుంది–' అన్నాడు సుధాకరం. అంతకన్న తక్కువ శాపం తోచలేదు అతనికి.

ఎలాగైతేనేం, ఓ నెల్లాళ్ళకు ఆవిడగారు వెళిపోయింది. ఆ తర్వాత, తన తరఫున బంధువులు, పెళ్ళాంతరఫున బంధువులు, తమ కొత్తకాపరం చూడ్డంకోసం అనివచ్చి, వారానికి తక్కువ లేకుండా వుండి, ఆశీర్వదించి వెళ్ళారు. వెళ్ళేటప్పుడు, మర్యాదలు చెయ్యకపోతే, ఇహ 'టమ్ టమా' చేస్తారు, తిన్నదంతా పోగా.

ఇదిగో, అలావచ్చిన జన సమూహంలోదే, ఒక ముఠా ఇవాళ వెళ్ళడంతో, సుధాకరానికి కాస్త రిలీఫ్ కలిగింది. కమల పాపం ఆడదికదా! ఆడవారు లజ్జా భరితులుకదా! వారు నోరు తెరచి ఏదీ అనుటగానీ, అడుగుటగానీ చేయరాదుటకదా! అంచేత కమల మూగనోము పట్టింది. భరించింది.

సాయంత్రం నాలుగు వరకూ ఆ మంచ[illegible] కలకనవ్వింది. కమలలేచి, గబగబా బజ్జీలు తయారుచేసింది. కాఫీకోసం బ్రూ సీసా మూతతియ్యమని, ఇంకామత్తుగా పడుకున్న సుధాకరం దగ్గరకెళ్ళింది.

'ఇంకా గోపీ టిక్కెట్టు తేలేదా?' అన్నాడు సుధ.

'లేదు. దొరకలేదేమో' అంది కమల.

'దొరక్కపోతే ఆ సంగతేనా చెప్పాలికదా' అని అంటుండగానే, దడదడ తలుపు చప్పుడైంది.

'అదిగో...గోపీ వచ్చేశాడు. తలుపుతియ్......' అన్నాడు హడావిడిగా మంచంమీద చూస్తూ.

తలుపు తీసిన కమల నిశ్చేష్టురాలైంది. సుధాకరం అక్కడున్న కుర్చీలో కూలబడబోయి, తేరుకున్నాడు.

పెళ్ళాం, నలుగురు పిల్లలు, పెట్టే బెడ్డింగులతో– కమల పెద్దన్నయ్య రాంజీ, హైదరాబాదునుండి ప్రత్యక్షమయ్యాడు.

♦ ♦ ♦ ♦

ఆ సాయంత్రం సినిమా సంగతేమైందో నాకు తెలీదుగాని, తనక్కడనుండి వెంటనే మరో చోటుకి బదిలీ చెయ్యమనీ రిక్వెష్ట్ చెయ్యడానికి, సుధాకరం,పి. ఎ, ఇంటికి వెళ్ళటం మాత్రం నేను చూశాను.

*USE ...*
*ALWAYS !!*
GITA'S
BANIANS
For
DURABILITY
And
FOR THE
COMPETITIVE
RATES.
—MFGRS—
Phone : 899
GITA KNITTINGS
**KONGUNAGAR 2nd St., TIRUPUR-2**